
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 18 ఫిబ్రవరి 2024
5
తిరుపతి



జిఎస్ఎల్వి విజయవంతం కావాలి
చెంగాళమ్మకు పూజలు

ప్రజాశక్తి- సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలో వెలసిన శ్రీచెంగాళమ్మ పరమేశ్వరీని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ శనివారం దర్శించి పూజలు చేశారు. శ్రీహరికోట నుండి జరిగే జిఎస్ఎల్వి - ఎఫ్14 రాకెట్ ప్రయోగం విజయవంతమై ఇన్ శాట్ -3 డీఎస్ ఉపగ్రహం విజయవంతంగా అంతరిక్ష కక్షలోకి చేరుకోవాలని కోరుకుంటూ చెంగాళమ్మకు పూజలు చేశారు. అనంతరం ఇస్రో ఛైర్మన్‌కు ఆలయ ట్రస్ట్ సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఆలయ మర్యాదలు అందజేశారు. సోమనాథ్ మాట్లాడుతూ భారతవాతావరణశాఖా ప్రయోజనాల కోసం శనివారం ఇన్ శాట్ 3 డిఎస్ ఉపగ్రహం ప్రయోగిస్తున్నట్లు తెలిపారు. మరో జిఎస్ఎల్వి -ఎఫ్15 రాకెట్ ద్వారా జూన్ నెలలో నిసార్ ఉపగ్రహం ప్రయోగంకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అలాగే 3వ ఎస్ఎస్ఎల్వి, పిఎస్-ఎల్వి ప్రయోగాలు ఉంటాయని సోమనాథ్ తెలిపారు.

భూకబ్జాను అడ్డుకున్న సిపిఎం

మద్దతు తెలిపిన జనసేన, టిడిపి



కబ్జాకు గురైన స్థలం ఎదుట నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, బాధితులు

ప్రజాశక్తి- తిరుపతి సిటి

తిరుపతి జిల్లా తిరుచానూరు గ్రామపంచాయతీ లెక్క దాఖలా సరస్వతినగర్‌లోని సర్వే నంబరు 260లో పెరుమాళ్ అనే వ్యక్తి పేరుపై ఉన్న 220 అంకణాల స్థలంలో, వైసీపీ ఎంపీటీసీ నరేష్, వారి అనుచరులు కబ్జాకు పాల్పడడంతో సిపిఎం ఆధ్వర్యంలో శనివారం కబ్జా జరుగుతున్న ప్రాంతంలో నిరసన తెలియజేశారు. ఈనిరసనకు తెలుగుదేశం పార్టీ నాయకులు మధు, జనసేన కార్యకర్తలు మద్దతుగా నిలబడ్డారు. స్థానిక ఎంపీటీసీ నరేష్ తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ప్రైవేట్ స్థలాల్లో జొరబడి కబ్జాలకు పాల్పడడంతో బాధితులు, సిపిఎం కార్యకర్తలు, నాయకులు అక్రమ కట్టడాలను కూల్చివేసి, సిపిఎం, తెలుగుదేశం, జనసేన జెండాలు ఆ ప్రాంతంలో నాటి, ప్రైవేటు స్థలాల్లో వైసిపి భూ కబ్జాలను వ్యతిరేకించండి... వైసీపీ అక్రమాలను ఎదుర్కొండి... వైసిపి డౌన్‌డౌన్ అంటూ బాధితులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కందారపు మురళి మాట్లాడుతూ తిరుచానూరులో అక్రమాలు పెచ్చుమీరు తున్నాయని, ఆఖరుకు ప్రైవేటు భూముల్లో సైతం కబ్జాలకు పాల్పడడం... వైసిపి అక్రమాలకు పరాకాష్ట అన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన తనయుడు మోహిత్ రెడ్డిలు తిరుచానూరులో జరుగుతున్న అక్రమాలకు సమాధానం చెప్పాలని లేనిపక్షంలో వారి మద్దతుతో ఇవన్నీ జరుగుతున్నట్టుగా తాము భావించాల్సి వస్తుందని అన్నారు. స్వయంగా ఏఎస్పీ, సిఐలు కట్టడాలు ఆపమని చెప్పినా, ఏమాత్రం లెక్క పెట్టకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారంటేనే అధికార పార్టీ నేతల జోక్యం ఏస్థాయిలో ఉందో ఊహించుకోవచ్చని తెలిపారు. బాధితులు ఎస్పీ కార్యాలయంలో, ఏఎస్పీకి, తిరుచానూరు పోలీసులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు చేతులెత్తేశారని మండిపడ్డారు. రెవెన్యూ అధికారులు సైతం ఈసమస్యను పట్టించుకోక పోవడాన్ని తప్పుపట్టారు. సమస్య తీవ్రతను గమనించి తాము నేరుగా కబ్జా జరుగుతున్న ప్రాంతానికి వచ్చామని తెలిపారు. తమ విచారణలో స్థలం పెరుమాళ్ దేనని ఆ ప్రాంతంలోని ప్రజలు చెప్పారన్నారు. అధికార పార్టీ నాయకులు కావాలనే ఉద్దేశ్యపూర్వకంగా భూకబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. తప్పుడు వ్యవహారాలు మానుకోకుంటే తిరుచానూరులో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సి ఉంటుందని, వైసీపీ అక్రమాలను ఇంటింటికి ప్రచారం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనకారులు కబ్జా జరుగుతున్న ప్రాంతంలో టెంట్ వేసుకొని తమ నిరసనను కొనసాగించారు. తిరుచానూరులో ప్రైవేటు స్థలాలలో అక్రమ కట్టడాలను వ్యతిరేకిస్తూ, వైసిపి భూ కబ్జాలను నిరసిస్తూ 26వ తేదీ సోమవారం రెవెన్యూ కార్యాలయం వద్ద భారీ ధర్నాను చేపట్టనున్నట్టు ప్రకటించారు. సిపిఎం ఆందోళనపై స్పందించిన తిరుచానూరు సిఐ శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఐ వెంకట సుబ్బయ్య ఘటనాస్థలికి వచ్చి ఇరువర్గాలను శాంతింపజేసి కట్టడాలను ఆపి వేస్తున్నామని ప్రకటించారు. సిపిఎం తిరుపతి నగర కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, సాయిలక్ష్మి, రాధాకృష్ణ, బుజ్జి, వేణు, మాధవ్, కిషోర్, హరి రామ్ రెడ్డి, సాల్మన్ రాజు, జనసేన నాయకులు వెంకట్, బాధితుల సుమన్, పెరుమాళ్ళు తదితరులు పాల్గొన్నారు.




జిఎస్ఎల్వి-ఎఫ్ 14 ప్రయోగం విజయవంతం

సమాచార ఉపగ్రహ ప్రయోగాలలో అరుదైన ప్రయోగం...



ప్రజాశక్తి- సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన చరిత్రలో శాస్త్రవేత్తలు మరో అత్యంత కీలకమైన ఉపయోగాత్మకమైన ఉపగ్రహాన్ని శనివారం ప్రయోగించి ఘనవిజయం సాధించారు. శ్రీహరి కోటలోని సెకండ్ లాంచ్ ప్యాడ్ నుంచి జిఎస్ఎల్వి- ఎఫ్ 14 రాకెట్ ద్వారా ఇన్‌శాట్ 3డిఎస్ పేరుతో సమాచార సేవలకు ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రవేశపెట్టారు. 2275 కిలోలు బరువు ఉన్న కనీసం 10 సంవత్సరాల పాటు దేశానికి సేవలు అందిస్తుందని అనుకుంటున్న ఇన్‌శాట్ 3 డీఎస్ బహుళ ప్రయోజనాల కోసం రూపొందించబడింది. ఇప్పటికే భారత్ ఎన్నో ఇన్‌శాట్ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేర్చి ఉంది. అయితే వాటిలో కొన్నికాలం తీరాయి. మరికొన్ని ఉపగ్రహాలు విజయవంతంగా కక్ష్యలోకి చేరలేకపోయాయి. గతంలో భారీ ఉపగ్రహం ఇన్‌శాట్ 3డిని అనుకున్న కక్ష్యలోకి చేర్చలేకపోయినా శాస్త్రవేత్తలు ప్రస్తుతం ఇన్ శాట్ 3డిఎస్ పేరుతో సరికొత్తగా శాటిలైట్‌ను రూపొందించి ప్రయోగించారు. ఈ ఉపగ్రహ నిర్మాణం కూడా కొత్త డిజైన్‌తో రూపొందించారు. జియో సింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (జిఎస్ఎల్వి) సిరీస్‌లో ఇప్పటికీ 15రాకెట్లను శ్రీహరికోట నుంచి ప్రయోగించి ఉన్నారు. 2000 కిలోలకు పైగా ఉపగ్రహాలను అలవోలుగా అంతరిక్షంలోకి చేర్చగలిగే సామర్థ్యం కలిగిన ఈ తరహా రాకెట్లలో కొన్ని ఫెయిల్యూర్స్ ఉన్నాయి. అయితే ఇటీవల జిఎస్ఎల్వీ ప్రయోగాలు కూడా మన సాంకేతిక పరిజ్ఞానంతోనే రూపొందించబడి విజయవంతమయ్యాయి. ప్రస్తుతం 10వ సారి పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రాకెట్ లోని మూడవ కీలక దశ అయిన క్రయోజనిక్ ఇంజన్‌ను రూపొందించుకొని శాస్త్రవేత్తలు 16వ జిఎస్ఎల్వి ప్రయోగం విజయవంతం చేశారు. ఈ రాకెట్ మూడు దశలతో నిర్మితం కాగా అందులో మొదటిది ఘన ఇంధనం, రెండవది ద్రవఇంధనం, మూడవది క్రయోజనిక్ ఇంధనం కావడం విశేషం. ఈ రాకెట్‌తో కేవలం ఒకే ఒక ఉపగ్రహాన్ని అంతరిక్షంలోని జియోట్రాన్స్ ఫర్ ఆర్బిట్‌లోకి చేర్చారు. భూమికి 170 కిలోమీటర్లు తక్కువ దూరం, భూమికి 36,647 కిలోమీటర్ల ఎక్కువ దూరం దీర్ఘ వృత్తాకార కక్షలోకి చేరిన తర్వాత ఈ ఉపగ్రహాన్ని భూకేంద్రాల నుంచి నియంత్రించి నిర్ణీత కక్ష్యకు చేర్చారు. రాకెట్ ప్రయోగం జరిగిన తర్వాత 1123 నిమిషాలకు ఇన్ శాట్ 3 డీఎస్ కక్షలో ప్రవేశిస్తుంది.


నింగిలోకి దూసుకెళుతున్న జిఎస్ఎల్వి - ఎఫ్ 14

వ్యవసాయశాఖ అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల పనితీరులో
జిల్లాకు మొదటిస్థానం: కలెక్టర్



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: వ్యవసాయశాఖ అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల పనితీరులో జిల్లాకు మొదటి స్థానం దక్కడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధర్వంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు, అనుబంధశాఖల అధికారులతో కలిసి జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు భరోసా కేంద్రాలు, రైతులకు వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు, రాయితీ పై, రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల సరఫరా తదితర అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయశాఖ అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల పనితీరులో జిల్లాకు మొదటిస్థానం దక్కడం గర్వకారణంగా ఉందని వ్యవసాయశాఖ వారికి అభినందలు తెలిపారు. జిల్లాస్థాయిలో వ్యవసాయ సలహా మండలి కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి పథకాల గురించి రైతులు అవసరమైన సలహాలు, సూచనలు పొందే గొప్ప కార్యక్రమమని అన్నారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకి అవసరమైన అన్ని సేవలను రైతులకు అందుబాటులో ఉంచామని జిల్లా కలెక్టర్‌కి వివరించారు. రబీ ప్రధానపంట అయినా వరి రెండులక్షల ఎకరాల్లో సాగు అవుతుందని తెలిపారు. జిల్లాలో ప్రతి పంటకు 100శాతం ఈ క్రాపింగ్, ఈకేవైసీ ప్రక్రియ పూర్తి అయిందన్నారు. ఈ సమీక్షలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి, జిల్లా సిరికల్చర్ అధికారి గీతారాణి, మైక్రో ఇరిగేషన్ శాఖ అధికారి సతీష్, నీటిపారుదల శాఖ అధికారి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రహ్లాద్ గుర్జార్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

కుటుంబ సభ్యులకు అప్పగింత

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఎస్వీ జూ పార్కులో గురువారం సింహం చేత చిక్కి మృతిచెందిన రాజస్థాన్‌కు చెందిన ప్రహ్లాద్ గుర్జర్ మృతదేహానికి శనివారం పోస్టుమార్టం పూర్తి చేసి, వైద్యులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రహ్లాద సింహం బోనులో పడి మృతి చెందిన విషయాన్ని, పోలీసులు రాజస్థాన్‌లోని మృతుడి కుటుంబ సభ్యులకు తెలియజేసిన విషయం విధితమే. సమాచారం అందుకున్న మృతుడు తమ్ముడు మదన్‌లాల్ గుర్జార్, రాజురావత్ ఒరిస్సా రాష్ట్రంలోని బోడిగుమ్మ నుండి తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. వారు పోలీసుల సమక్షంలో తిరుపతి రుయా మార్చురీకి చేరుకుని మృతదేహాన్ని దేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహం స్వాధీనం చేసుకొని, ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో రాజస్థాన్‌కు బయలుదేరి వెళ్లారు.

తిరుపతి అభివృద్ధితోబాటు
ఆధ్యాత్మికంగా ముందుకెళ్తుంది

టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: తిరుపతిలో ఓ వైపు అభివృద్ధి దిశగా, మరోవైపు ఆధ్యాత్మిక వాతావరణం వెల్లువిరిసేలా ముందుకెల్లుతున్నదని టీటీడీ ఛైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి ఇస్కాన్ రోడ్డును కలుపుతూ చెన్నారెడ్డి కాలనీ వైపు నుంచి నిర్మించిన నూతన కనెక్టవిటీ రోడ్డును శనివారం టీటీడీ ఛైర్మన్, ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా, మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్, ముద్రనారాయణ, ఇస్కాన్ టెంపుల్ నిర్వాహకులు రేవతి రమణదాస్ ప్రారంభించారు. భూమన మాట్లాడుతూ నేడు ప్రారంభిస్తున్న ఈనూతన రహదారికి ఇస్కాన్ టెంపుల్స్ వ్యవస్థాపకులైన అభయ చరణారవింద భక్తి వేదాంతస్వామి ప్రభుపాదుల వారి పేరును ఈమార్గానికి నామకరణం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. తిరుపతిలోని నూతన రహదారులకు మహనీయుల పేర్లను పెట్టడం వలన ఓ ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తున్నదని అన్నారు. కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, పుణిత, వరికుంట్ల నారాయణ, మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డీఈ విజయకుమార్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్ రెడ్డి, బొగ్గుల వెంకటేశ్వర్లు, అరుణ్ కుమార్, శ్యామల, పెరుగు బాబుయాదవ్, వంశి, రాజశేఖర్, శివకుమార్ పాల్గొన్నారు.



చేయించినోళ్లు సేఫ్

దొంగోట్ల లీలలకు అధికారులే బలి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

పాలకులు.. అధికార పక్షం అగడాలు అంతేలేదు. అక్రమాలు..దోపిడులు ఇతరాత్ర వాటి మాట దేవుడెరుగు..ఆఖరికి రాజ్యాంగాన్నే అపహాస్యం చేస్తున్న ఘటనలు కొకొల్లాలు. రాష్ట్రంలో అధికార పక్షం మరో అడుగు ముందుకేసి ఏకంగా దొంగోట్ల నమోదుకు దిగడం. అది బహిర్గతం కావడం, ఎన్నికల కమీషన్ సీరియస్ అవడంతో అధికారులను బలిపశువులను చేశారు. కానీ చేయించినన వారు మాత్రం సేఫ్ అవడం గమనార్హం.

ఆవు చేనులో మేస్తే దూడ గట్టున మేస్తుందా.. అనే చందాగా కేంద్ర ప్రభుత్వం కంటే రాష్ట్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకు దూసుకెళుతోంది. ప్రజల ద్వారా, ప్రజల కోసం, ప్రజలే ఎన్నుకోబడేలా రాజ్యాంగం ఏర్పడింది. ఎవ్వరైన ప్రజాసేవ కోసం రాజకీయాల్లో ప్రవేశించే రోజులు ఏనాడో పోయాయి. సంపదనే ధ్యేయంగా...అధికార దాహంతో పరితపించే రోజులు నడుస్తున్నాయి. ఎవ్వరైనా ప్రజాప్రతినిధులు తప్పచేస్తే, పాలకులు ప్రజాసంక్షేమాన్ని పక్కనపెడితే, అభివృద్ధి దిశగా ముందుకెళ్లకపోతే ప్రజలు తమ ఓటుతో ఎన్నికల సందర్భంగా వారికి తగిన గుణపాఠం చెప్పాలని మేధావులు రాజ్యాంగం ద్వారా ప్రజలకు వజ్రాయుధానికి కంటే బలమైన ఓటుహక్కును కల్పించారు. కానీ నేటి పాలకులు దాన్ని అపహాస్యం చేస్తూ అధికారంలో ఉన్న తమను ఎవ్వడేమి చేస్తాడు అనే ధీమాలో వెళ్లుతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని, అధికారులపై ఒత్తిడి తెచ్చి, ఏకంగా తమ గెలుపుకు అనుకూలంగా దొంగఓట్ల నమోదుకు దిగడం దారుణం. ఇలాంటి చర్యలు క్షమించరానివి. కానీ ఏమి చేద్దాం మనది ఘనత వహించిన ప్రజాస్వామ్యం కదా.. ప్రతి ఒకరికి ఏదైనా చేసే స్వేచ్ఛ ఉన్నట్టుంది. అది కూడా అధికార పక్షానికే. అందుకే బరితెగించి, బహిరంగానే రాజ్యాంగాన్ని నిర్వర్యం చేసేలా వ్యవహరిస్తున్నారని పలువురు బహిరంగానే చర్చించుకోవడం గమనార్హం.



దొంగోట్ల పాపం ఎవ్వరి..?

2021లో జరిగిన తిరుపతి లోకసభ ఉపఎన్నికల అక్రమాలు బహిర్గతం కావడంతో దీనిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఉపఎన్నికల్లో అధికారపార్టీ అభ్యర్థి గెలుపుకోసం తిరుపతి కేంద్రంగా భారీస్థాయిలో దొంగ ఓట్లు నమోదు కావడం, దీన్నిపై ప్రతిపక్షాలు పోరాడటం, వామపక్ష పార్టీలు, మీడియా స్వయంగా దొంగ ఓటర్లను పోలీసులకు పట్టించడంతో చర్యలు తప్పలేదు. అది కూడా రెండినార్ర సంవత్సరాలు వేచి చూసిన ఈసి ఎట్టికేలకు సంబంధిత అధికారులపై చర్యలకు ఉపక్రమించింది. తిరుపతి ఎన్నికల ఆర్‌వోగా విధులు నిర్వహించిన అప్పటి కార్పొరేషన్ కమిషనర్ గిరీషాను భాద్యున్ని చేస్తూ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బాధ్యతులు నిర్వహిస్తున్న ఆయన్ని సస్పెండ్ చేసింది. తిలాపాపం తలాపిడికెడు.. కానీ ఒకర్ని భాద్యులు చేయడమేమిటని రాజకీయ పార్టీలు విమర్శించడంతో అప్పటి ఎన్నికల్లో ఏఆర్‌వో వ్యవహరించిన కార్పొరేషన్ డిప్యూటీ కమీషనర్ చంద్రమౌళిరెడ్డిని కూడా సస్పెండ్ చేసింది. దొంగఓట్ల కారకులపై చర్యలు తీసుకోవాలనే వాదన తీవ్రం కావడంతో రాజకీయ పార్టీల ఫిర్యాదులను పట్టించుకోలేదని, కొన్ని ఫిర్యాదులను తీసుకున్న వాటిని నిరూగార్చేలా చేశారని, పోలీసుల నిర్లక్ష్యం వల్లే దొంగ ఓట్లు తంతు సాగిందని బావించి, ముగ్గురు సిఐలు శివప్రసాద్‌రెడ్డి, దేవేంద్ర కుమార్, శివప్రసాద్, ఎస్ఐ జయస్వాములు, హెడ్‌కానిస్టేబుల్ ద్వారకానాథ్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. మరో సిఐ అబ్బన్నను విఆర్‌కు బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. వాస్తవానికి ఉప ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థి గెలవాలనే దొంగ ఓట్లకు ఉపక్రమించింది. అందుకు బాధ్యులు ఎవ్వరు? దొంగఓట్లతో గెలుపొందిన ఎంపిని కనీసం ప్రశ్నించలేదు. దొంగ ఓట్లకు పురమాయించి, అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి, బెదిరించిన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ పెద్దల పరిస్థితి ఏంటి..? దగ్గరుండి దొంగోట్లు వేయించిన అధికార పార్టీ నాయకులు, దౌర్జన్యానికి పాల్పడిన అనుయుల పై చర్యలు లేవి? ఇవేవి ఉండవు. ఈసి అయినా తమకు అనుకూలంగానే వ్యవహరించాలి అనేలా అధికార పార్టీ వ్యవహరిస్తున్న తీరు పలువుర్ని విస్మయానికి గురి చేస్తోంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీనే కాదు. గతంలో పాలించిన పార్టీలది కూడా ఇదే తంతు. వామపక్ష పార్టీలు తప్ప బూర్జువ పార్టీలన్ని అక్రమాలు, అన్యాయాలు, దోపిడిలకే తొలి ప్రాదాన్యత ఇచ్చేలా వ్యవహరిస్తున్నాయి. గతంలో తిరుపతి అసెంబ్లీ ఉపఎన్నికల్లో అప్పడి టిడిపి అభ్యర్థి గెలుపుకోసం సరిహద్దు రాష్ట్రమైన కర్నాటక నుంచి సైతం బస్సుల్లో దొంగ ఓటర్లను తరలించిన విషయం అందరికి ఎరుకే. అప్పటి ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి స్వయంగా నాలుగు బస్సులకు సంబంధించిన దొంగ ఓటర్ల బస్సులకు అడ్డుగా పడుకుని, మీడియా సాక్షిగా పోలీసులకు అప్పగిస్తే కనీసం దొంగ ఓటర్లను పోలీసు స్టేషన్‌కు కూడా తరలించిన పాపనపోలేదు. తిరుపతి కేంద్రంగా దొంగ ఓట్ల దందా దశాబ్దాకాలంపైగా బహిరంగంగానే జరుగుతున్న ప్రశ్నించే వాడు లేడు, ఒక వామపక్షాలు తప్పా.

ఎంఎల్‌సి ఎన్నికల్లోనే ఇదే తంతు...!

ఉపాధ్యాయ, పట్టాభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూడా ఇదే తంతు. ఏకంగా సంతకం కూడా రానీ నిశాని పట్టాభద్రుడి ఓటరుగా నమోదైన ఘటనలు అనేకం. ఐదో తరగతి కూడా చదవని వ్యక్తి పట్టాభద్రుడుగా ఓటుహక్కు వినియోగించుకోవడం సాక్షాత్తు మీడియానే బహిర్గత పరిచింది. స్కూల్ మోహం కూడా చూడని వారు ఉన్నత చదువులు చదివారనేలా అధికార పార్టీ వ్యవహరించిన తీరు తిరుపతివాసులకు కెరుకే. కార్పొరేషన్ ఎన్నికల్లో అయితే సాక్షత్తు ఎన్నికల అధికారి కార్యాయలం గేటు వద్దే అధికార పార్టీ నాయకులు కాపుకాసి నామినేషన్ వేసేందుకు వచ్చిన ప్రత్యార్థులపై దాడి చేయడం, వారి పత్రాలు చింపేయడం, వారిని కిడ్నప్ చేయడం, పోటీ దారులను భయభ్రాంతులకు గురి చేయడం అందరికి తెలిసిన వాస్తవం. పోలింగ్ సమయంలో అధికారపార్టీ నాయకులు మాత్రమే ఏజెంట్లు ఉంటూ మిగిలిన ఏజెంట్లను బయటకు పంపి అధికారుల అండతో ఓట్లు గుద్దుకున్నారన్న ఆరోపణలు పెలుబిక్కాయి. ఇక సంస్థాగత ఎన్నికల్లో జరిగిన ఘోరాలు, నేరాలు, దౌర్జన్యాలు లెక్కలేనన్ని, అన్ని ఏకగ్రీవాలే, ప్రజలు, వామపక్షాలు తిరగబడిన ప్రాంతాల్లో తూతుమంత్రంగా కొన్ని స్థానాల్లో మాత్రం ఎన్నికలు జరిపాము అనిపించుకున్నారు. ఇలా రాజ్యాంగాన్ని పాలకులు తమ చేతుల్లోకి తీసుకుని, అన్ని తామే అనేలా వ్యవహరిస్తే ఇంక ప్రజాస్వామ్యం ఎక్కడుంటుంది. కనీసం ఎన్నికలైన పకడ్బందిగా, పారదర్శకంగా నిర్వహించి, ప్రజలకు నచ్చిన వారిని ఎన్నుకునే ఎన్నికలు సక్రమంగా జరగాలని పలువురు నిపుణులు, ప్రజలు కోరుకుంటున్నారు.

కళ్లకు నల్లరిబ్బన్ల కట్టుకుని నిరసన



ప్రజాశక్తి - క్యాంపస్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఒప్పంద సేవలు కింద పనిచేస్తున్న వర్కర్లకు కనీస వేతనం పెంచాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం నల్ల రిబ్బనలతో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. నిరసనకు ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ మద్దతు తెలిపారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎస్.జయచంద్ర, మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి, సమాన వేతనం అమలు చేయాలి బేసిక్ పే, డిఏ, సిసిఏతో కూడిన వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అగ్రికల్చర్ పరిధిలోని రీసెర్చ్ స్టేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు లేబర్ వివరాలను రీసెర్చ్ స్టేషన్‌లో నమోదు చేయాలని, వారిని టైంస్కేల్ వర్కర్లకు గుర్తించాలని కోరారు. అగ్రికల్చర్ పరిధిలోని వివిధ రీసెర్చ్ స్టేషన్‌లో పనిచేస్తున్న కాంటాక్ట్ లేబర్‌ను ఔట్సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చాలన్నారు. కాంట్రాక్ట్ లేబర్‌కు సంవత్సరం మొత్తం పనిచూపించాలని డిమాండ్ చేశారు. ఆఫీసులలో పనిచేస్తున్న స్లీపర్, అటెండర్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఔట్సోర్సింగ్ కార్మికులకు ఇస్తున్న ప్రమాద సహజ మరణ నష్టపరిహారం కూడా ఇవ్వాలి కార్మికశాఖ ఇచ్చిన ఆదేశాల ప్రకారం కాంట్రాక్టు లేబర్‌కు జాతీయ పండుగ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇవన్నీ ప్రభుత్వం అమలు చేయకుండా పోతే పెద్దఎత్తున పోరాటాన్ని ఉదతం చేస్తామని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. యూనియన్ నాయకులు వరలక్ష్మి, రాకేష్, చంద్రమ్మ, సుబ్బు, మునిలక్ష్మి, రాధా, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల రద్దీ క్రమబద్ధీకరణపై
అయోధ్య ట్రస్టు ప్రతినిధులకు అవగాహన

ప్రజాశక్తి- తిరుమల: భక్తుల రద్దీ క్రమబద్ధీకరణతోపాటు క్యూలైన్ల నిర్వహణ తదితర అంశాలపై అయోధ్యలోని శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ప్రతినిధులకు టీటీడీ ఈవో ఏవి.ధర్మారెడ్డి నేతృత్వంలోని అధికారులు అవగాహన కల్పించారు. ట్రస్టు ఆహ్వానం మేరకు టీటీడీ అధికారులు శనివారం అయోధ్యకు చేరుకున్నారు. ట్రస్టు కార్యాలయంలో ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బాలరాముని ఆలయానికి వచ్చే భక్తులకు సంతృప్తికరంగా దర్శనం కల్పించేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేపట్టాలనే విషయాలను టీటీడీ ఈవోను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్ల నిర్వహణకు సంబంధించి టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు పలు సూచనలు చేశారు. అనంతరం టీటీడీ అధికారులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అయోధ్య ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ అనిల్ మిశ్రా, గోపాల్‌జి, జగదీష్ ఆఫ్లే, గిరీష్ సహస్ర భోజని, విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి రాఘవులు, డిఎస్ఎన్ మూర్తి, టీటీడీ సాంకేతిక సలహాదారు జి.రామచంద్రారెడ్డి, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, డెప్యూటీ ఈఈలు బాబు, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీలకు ఇచ్చిన
హామీలు నిలబెట్టుకోవాలి

యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్



ప్రజాశక్తి - పుత్తూరుటౌన్: రాష్ట్రంలో అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కారం కోసం 42 రోజులు సమ్మె చేసి వీరోచితమైన పోరాటం చేయడం జరిగింది. ఈ సందర్భంగా చివరలో రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం వెంటనే జీవోలు విడుదల చేయాలన శనివారం పుత్తూరులో అంగన్వాడీలకు జరిగిన శిక్షణ తరగతుల్లో ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడీలు చేసిన పోరాటం వీరోచితమైందని తెలిపారు. ప్రభుత్వం దిగివచ్చి చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం జీవోలు ఇవ్వకపోతే మళ్ళీ పోరుబాట పట్టాల్సి వస్తుందని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక రైతువ్యతిరేక విధానాలపై కార్మికులు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఐసిడిఎస్‌ను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతున్నదని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలను రద్దు చేసి యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలో ఉన్న అధికారపక్షం, ప్రతిపక్షం మద్దతు తెలపడం సిగ్గుచేటు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌కు నిధులు కేటాయించి అందులో పనిచేస్తున్న అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందంలో ప్రభుత్వం ఎలాంటి కక్ష సాధింపు చర్యలు చేపట్టమని స్పష్టంగా చెప్పినప్పటికీ అధికారులు మాత్రం వర్కర్లపై రెట్టింపు స్థాయిలో కక్ష సాధింపు చర్యలు పాల్పడుతూ ప్రతి చిన్న విషయానికి సిడిపిఓ పర్మిషన్ తీసుకోవాలని అధికారులు చెప్పడం ఏమిటంటే ప్రశ్నించారు. అయితే మరి సూపర్వైజర్లు ఎందుకు అని ప్రశ్నించారు. వెంటనే సమస్యలు పరిష్కారం చేయాలని జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటేష్, నగరి అధ్యక్ష ధనకోటి, కార్వేటినగరం అధ్యక్షురాలు లక్ష్మీనరసింహ, కార్యదర్శి పంచవర్మ పాల్గొన్నారు.

డిప్యూటీ ఈవోగా ఏకాంబరం
వెంకటసుబ్బయ్య బదిలీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో డిప్యూటీ ఈవోగా ఏకాంబరంను నియమించారు. ఈయన గతంలో బోయకొండ గంగమ్మ ఆలయ ఈవోగానూ, చిత్తూరు అసిస్టెంటు కమిషనరుగా విధులు నిర్వర్తించారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో డిప్యూటీ ఈవోగా పని చేస్తున్న వెంకటసుబ్బయ్యను నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయ ఈవోగా బదిలీ చేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి: జడ్జి

ప్రజాశక్తి -వెంకటగిరి: వెంకటగిరి బంగారుపేట ఒకటవ వార్డు సచివాలయంలో వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ ఓ అనూష, జడ్జి వెంకటగిరి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతి కుమార్ విద్యార్థిని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ లీగల్ లిటరసీ ప్రోగ్రాం శనివారం నిర్వహించారు. కేజే ప్రకృతి కుమార్ మాట్లాడుతూ మహిళా వేధింపుల కేసులలో బాధితురాలి పేరు, వివరాలు బాధితురాలి కుటుంబ సభ్యుల పేర్లు ఎవరైనా రాత పూర్వకంగా వీడియో విజువల్స్, న్యూస్ ఛానెల్స్ ద్వారా గాని బయటకు తెలియపరిస్తే అలాంటి వ్యక్తిపై కేసునమోదు చేస్తామని హెచ్చరించారు. చట్టాల పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఓ అనూష పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి న్యాయవాదులు పెట్లూరు రాంప్రసాద్, దుగ్గి రాజారావు, పోలీసుశాఖ అధికా రులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: మండల తహశీల్దారు కార్యాలయ అధికారులు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరుతూ మండల తహశీల్దారు కార్యాలయం వద్ద బీఎస్ఎస్ఎఫ్ నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్ఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ … రాష్ట్రానికి చెందిన అనేక మంది దరఖాస్తు చేసుకున్నారని చాలా రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయలేదని తమ దృష్టికి వచ్చిందని ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఇంటి వద్దకే తీసుకువెళ్లి అందిస్తామని వైసిపి ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ అసత్యాలే అన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు.

విద్యతోనే విజ్ఞానం

ప్రజాశక్తి-తొట్టంబేడు: బాల్య దశలో నేర్చుకునే విద్యతోనే విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని దిగువ సాంబయ్య పాళెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి అన్నారు. మూడవ శనివారం ఉపాధ్యాయులు బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన 'నో బ్యాగ్ డే' ను పురస్కరించుకుని విద్యార్థులు వివిధ రకాల సృజనాత్మక కృత్యాలను నిర్వహించారు. అట్ట ముక్కలతో ఇళ్లు, రాకెట్, గడియారం తయారు చేశారు. చిత్రలేఖనం వేశారు. ఆట పాటలు, పద్యాలు, అభినయ గేయాలతో అలరించారు.

మాజీ ఎమ్మెల్యే హేమలతకు అస్వస్థత

ప్రజాశక్తి - నారాయణవనం: సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం రాత్రి చెన్నైలోని ఆమె నివాస గృహంలో ఆమె హఠాత్తుగా కళ్లు తిరిగి కిందపడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన చెన్నై అపోలో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు.

కాంస్య రాయల విగ్రహం ప్రతిష్టించాలి
కాపు నాయకుల సూచన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయుల విగ్రహాన్ని ఆయన స్మారకంగా తిరుపతి లీలామహల్ కూడలిలో ఏర్పాటు చేశారని, అటు తరువాత ఫ్లై ఓవర్ నిర్మాణ నేపథ్యంలో దాన్ని తొలగించి నేడు ఆ స్థానంలో ఫైబర్ రాయలవారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల కాపు నాయకులు స్పందించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో కాపు నాయకులు సరిత నాగరాజు రాయల్, సింగంశెట్టి సుబ్బరామయ్య మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహాన్ని పాలకులు ఫైబర్ తో తయారు చేయించి లీలామహల్ కూడలిలో సహేతుకం కాదన్నారు. ఈ సమావేశంలో గుట్ట నాగరాజు రాయల్, చింతకాయల కృష్ణ, వెంకటరాయలు, జీవన్ ప్రసాద్ పాల్గొన్నారు.

చెకుముకి విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలో విజేతలకు జిల్లా పరిషత్ బాలుర ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం వరప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. చెకుముకి విజేతలైన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు ఇవ్వడానికి సహకరిస్తున్న డాక్టర్ కుడుముల నారాయణ ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, రామమోహన్, ప్రభాకర్, గుర్రం విజయ్ బాబు, సుబ్బారావు, ఆనంద్, శ్రీనివాసాచారి, స్కూల్ టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతిని రాజధాని చేయాలి: మాజీ ఎంపీ

ప్రజాశక్తి - నాయుడుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతా మోహన్ తిరుపతి రాజధాని చేయాలని కాంగ్రెస్ నాయకులతో కలిసి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పంట శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకులు డాక్టర్ చింతా నీనా, తేజోవతి, పూల చంద్ర శేఖర్, చందనమూడి శివ, గాదె వెంకటయ్య, నాగూర్ పాల్గొన్నారు.

వాలంటీర్ల పాత్ర కీలకం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -దొరవారిసత్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించడంలో వాలంటీర్ల పాత్ర కీలకమైందని, సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆయన శనివారం దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వాలంటీర్ల సన్మానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మండల ఉపాధ్యక్షులు గురు గోపాల్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ ఈశ్వర్ వాక శ్రీనివాసరెడ్డి, తిరుపతి డిఎల్‌డిఓ వెంకటశేషయ్య, నాయకులు శ్రీనివాసులు, రెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని చాగనం లలితమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ భవనంలో శనివారం మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం ఆధ్వర్యంలో వాలంటీర్లకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎస్‌విఎస్‌ఐ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ రెడ్డి, జడ్పీటీసీ ప్రిస్కిల్లా, రఘు నాయుడు, మండల సీనియర్ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రసాయన ఔషధాల తయారీపై అవగాహన

ప్రజాశక్తి - రామచంద్రాపురం: రసాయన ఔషధాల తయారీపై ఫార్మసీ విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రొఫెసర్ రవిశంకర్ పిలుపు నిచ్చారు. శనివారం వెంకటరామాపురంలోని ఫార్మసీ కళాశాలలో గ్లోరీ ఫార్మా కెమిస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్, సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల సంయుక్తంగా రసాయన ఔషధాల తయారీలో కెమిస్ట్రీ పాత్ర పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రవిశంకర్ మాట్లాడుతూ రసాయన ఔషధాల తయారీ నమూనాలపై సాంకేతిక విధానాలను ఫార్మసీ విద్యార్థులు పెంపొందించుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్ బాబు మాట్లాడుతూ ఔషధాల తయారీ రంగంలో … పరిశ్రమ … ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ 7 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి మాధవి ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్ పై శిక్షణ లో శనివారం యూనివర్సిటీ ప్రాంగణంలో విద్యార్థులకు నిర్వహించారు. డాక్టర్ పి మాధవి విద్యార్థులను … అని అందులో మహిళా విద్యార్థులకు మరింత … పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి నేషనల్ లెవెల్, స్టేట్ లెవెల్ … టి లావణ్య కుమారి, వి పూజ, ఎన్ దివ్య పూజ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్, జువాలజీ, బయో కెమిస్ట్రీ, ఎకనామిక్స్ విద్యార్థినులు, ఉమెన్స్ స్టడీ సెంటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్. కే. రాణి, రీసెర్చ్ అసిస్టెంట్ ప్రీతి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి 12వ పిఆర్‌సి ని ప్రకటించాలని ఏపీ జెఎసి నాయకులు శ్రావణ్ డిమాండు చేశారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ టీచర్స్ వర్కర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ గూడూరు ఛైర్మన్ శ్రావణ్, చిరంజీవి, బాబు, శ్రీనివాసులు, సుధీర్, సుబ్రహ్మణ్యం, రాజు, బాష పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : ఏపీ జెఎసి మేరకు పుత్తూరు తాలూకా తహశీల్దారు ఏపీ జెఎసి ఆధ్వర్యంలో పట్టణం లోని స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద ర్యాలీ నిర్వహించి ధర్నా చేప ట్టారు. ఈ సందర్భంగా ఏపీ జెఎసి ఛైర్మన్ టి గిరి ప్రసాద్ మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ రద్దు చేయమని సభాముఖంగా డిమాండ్ చేశారు. పుత్తూరు మండల ఎస్‌టియు నాయకులు కేశవులు పాల్గొన్నారు. పెన్షనర్స్ కు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. తర్వాత ఉద్యోగ ఉపాధ్యాయులు పెన్షన్స్ కలసి ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ సర్కిల్ దగ్గర నిరసన తెలిపి డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీవో సెక్రటరీ ఈ శశిధర్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ లోకనాథం, ట్రెజరర్ నాగజ్యోతి, వైస్ ప్రెసిడెంట్ ఖాత్యాయని పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో నిరసన తెలుపుతున్న ప్రభుత్వ ఉద్యోగ జెఎసి నాయకులు

శ్రీకాళహస్తి: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం చేపడతామని ఏపీఎన్జీవో సంఘం శ్రీకాళహస్తి తాలూకా అధ్యక్షులు చెంచురత్నం యాదవ్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్న వైసీపీ సర్కారు విధానాలను నిరసిస్తూ శ్రీకాళహస్తి తహసీల్దారు కార్యాలయం ఎదుట శనివారం ఏపీ ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చెంచురత్నం యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యల సాధన కోసమే ఉద్యమాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో రాష్ట్ర నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు కార్యాచరణ రూపొందించి సమస్యల సాధన కోసం నిరసన దీక్షలను చేపట్టినట్లు తెలిపారు. వీరికి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జలసుధీర్ రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురువయ్య మద్దతు పలికారు.

ప్రహ్లాద్ గుర్జార్ మఠం సిబ్బందిపై దాడి చేశాడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాలలో గురువారం సింహాల ఎన్ క్లోజర్ లోకి దూకి మృత్యువాత పడిన రాజస్థాన్ కు చెందిన ప్రహ్లాద్ గుర్జార్ బుధవారం తిరుమలలోని శ్రీ స్వామి హాథీరాంజీ మఠంకు చెందిన వేణుగోపాల స్వామి ఆలయంకు వెళ్లి మఠం సిబ్బందిపై దాడి చేసి గాయపరిచాడు. వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్లిన ప్రహ్లాద్ గుర్జార్ ను మఠం సిబ్బంది దర్శనానికి వెళ్లాలంటే టోకెన్ తీసుకోవాలని చెప్పడంతో ఒక్కసారిగా కోపోద్రిక్తుడైన ప్రహ్లాద్ టోకెన్లు విడుదల చేసే యంత్రాలను మఠం సిబ్బందిపై విసిరేశాడు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా భయానక వాతావరణం ఏర్పడింది. ప్రహ్లాద్ తన చేతిలోకి ఏదో చిన్నపాటి ఆయుధాన్ని తీసుకొని చుట్టుపక్కల వారిని బెదిరించాడు. సమీపంలోని దుకాణ నిర్వాహకులు ఈ ఘటన చూసి దగ్గరకు వచ్చి అతనిని బల వంతం గా లాక్కొని తాళ్లతో కట్టి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు. అతడిని పట్టుకునే సమయంలో గంజాయి వినియోగించినట్లు అక్కడివారు గుర్తించినట్లు సమాచారం. మత్తుకు బానిసైన ప్రహ్లాద్ గుర్జార్ ఆ మత్తులోనే సింహం ఎన్ క్లోజర్ లోకి దూకాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



మఠం సిబ్బందిపై దాడికి పాల్పడుతున్న ప్రహ్లాద్ గుర్జార్

నిర్దేశిత ప్రాంతాల్లోనే షాపులివ్వాలి
వెల్డింగ్ షాపులకు కేటాయించిన స్థలాలపై స్టేటస్ కో

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గతంలో ప్రభుత్వం వెల్డింగ్ షాపులకు కేటాయించిన స్థలాలలో తుడా అధికారులు నిర్మాణాలు చేపట్టడంతో శ్రీ వెంకటేశ్వర ఫ్యాబ్రికేటర్స్ అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు స్టేటస్కో ఇచ్చిందని అసోసియేషన్ సభ్యులు గోవిందు, హబీబ్, జయరాం, కుమార్, మహేష్ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో కేటాయించిన సర్వేనెంబర్ 74/7, 95/2లోనే ఇవ్వాలని తమకు ప్లాట్లు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెల్డింగ్ షాపులకు కేటాయించిన స్థలాలను అధికారులు తమ ఇష్టానుసారం మారుస్తూ గత 26 సంవత్సరాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వీరికి సంఘీభావం తెలిపిన టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబూరు సింధూజ మాట్లాడుతూ గతంలో వెల్డింగ్ షాపులకు ప్రభుత్వం కేటా యించిన సర్వే నెంబర్లలోనే స్థలాలు ఇవ్వాలన్నారు. తిరుపతిని స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేస్తు న్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం వెల్డింగ్ కార్మికులను సంవత్సరాలుగా వేధించడం సరికాదన్నారు. హైకోర్టు ఇచ్చిన స్టేటస్కో ప్రతిని ఇప్పటికే తుడా అధికారులకు, పోలీస్ అధికారులకు అందించామన్నారు. అధికారులు వెంటనే వారికి గతంలో ప్రభుత్వం నిర్దేశించిన స్థలంలోనే ప్లాట్లను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్, శ్రీహరి రెడ్డి, కె చంద్రశేఖర్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెల్డింగ్ షాపుల అసోసియేషన్ సభ్యులు

'సత్యాన్వేషి బ్రూనో బలిదానం నాటక ప్రదర్శన

ప్రజాశక్తి- రేణిగుంట: సత్యాన్వేషి బ్రూనో బలిదానం సత్యాన్వేషణ నాటికను రేణిగుంట లోని జిల్లా పరిషత్ బాలుర బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా జెవివి ఉపాధ్యక్షుడు ఓ వెంకటరమణ మాట్లాడుతూ క్రీస్తుశకం 1600. ఫిబ్రవరి 17 సత్యస్థాపన కోసం నిలచిన సత్యశోధకుడైన గియోనార్డో బ్రూనోను అప్పటి మతపాలకులు ఇటలీలో బహిరంగంగా సజీవ దహనం చేశారని, భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడన్నది మతపాలకులవాదన అని, సూర్యుడు చుట్టూ భూమి తిరుగుతున్నాడని బ్రూనో ప్రచారం చేశాడని మత గ్రంథానికి విరుద్ధంగా చేస్తున్నాడని ఆయనను ఏడేళ్ల పాటు చీకటి గదిలో బంధించి చిత్ర హింసలు పెట్టి సజీవ దహనం చేశార న్నారు. చివరి వరకు తన మాటపై నిలబడి బలిదానం అయ్యాడని, దీన్నే నాటకంగా రేణిగుంట బాలు రు, పాఠశాల విద్యార్థులు నాటిక ద్వారా బాలు రు, బాలికల పాఠశాల ల్లోనూ సత్యాన్వేషణ దినం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రేణిగుంట మండల కార్యదర్శి కుప్పస్వామి మాట్లాడుతూ 'నేటికి పాలకుల ఛాందస భావాలు పెరిగిన నేడు బ్రూనో సత్యాన్వేషణ బాటలో నడవాలని పిలుపు నిచ్చారు.



జెవివి ఆధ్వర్యంలో నాటకాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

81 సర్వే నెంబరు భూమిని దళితులకు పంచాలి: సిపిఎం



డిటికి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు రమణయ్య

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కుక్కంబకం రెవెన్యూలోని 81 సర్వే నంబరులోని భూమిని కుక్కంబాకం గ్రామానికి చెందిన దళితులకు పంచాలని శనివారం ఉదయం సిపిఎం నాయకులు రమణయ్య ఆధ్వర్యంలో డిటి చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కంబాకంలో 1995లో పేదలైన దళితులకు ఇచ్చిన సర్వే నంబరు 31 నుండి 52 మందికి ఒక్కొక్కరికి ఒకటిన్నర ఎకరా చొప్పున గతంలో పంపిణీ చేశారన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ఆ భూమిని కుక్కంబాకం వీఆర్వో తేజ రెడ్డి దళితుల భూములను అగ్రకులాలకు చెందిన వారికి పట్టాలు పాసుబుక్కులుగా మార్చారని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. 'తేజ రెడ్డి డౌన్ డౌన్.. వీఆర్వో డౌన్ డౌన్..' అంటూ నినాదాలు చేస్తూ డిటికి వినతి పత్రం అందించారు. వెంటనే రెవెన్యూ అధికారులు తేజ రెడ్డిపై విచారణ జరిపి కుక్కంబాకం గ్రామానికి చెందిన దళితులకు ఆ భూమిని ఇప్పించేలా చూడాలని లేదంటే కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి తమ గోడును కలెక్టర్‌కి విన్నవించుకుంటామని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు రమణయ్య, కుక్కంబాకం గ్రామ దళితులు పాల్గొన్నారు.

బస్సులు రాక విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు
- రాత్రి 6 గంటల వరకు విద్యార్థుల నిరీక్షణ - ఆందోళనలో తల్లిదండ్రులు

ప్రజాశక్తి -బాలాయపల్లి : నాల్గు గంటలకు వచ్చే బస్సు రాక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటన శనివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు వెంకటగిరి ఆర్టీసీ డిపో నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు సకాలంలో రాక పోవడంతో విద్యార్థులు ఇళ్లకు ఏడు గంటలకు చేరుకోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. సాయంత్రం 4.45 గంటలకు పాఠశాల వదిలినప్పటి నుంచి రాత్రి ఆరు గంటల వరకు బస్సు కోసం ఎదురు చూశారు. గూడూరు రూరల్ మండలం తిప్పావారుపాడు, కందలి, చెమిర్తి, తిరువేళయపల్లి గొల్లపల్లి, నెర్జురూ, వెంకటరెడ్డిపల్లి, నిండలి, అంబలపూడి, అలిమిలి, కుందకూరు గ్రామాలకు చెందిన తమ పిల్లలు రాత్రి 8 గంటలైనా ఇంటికి రాలేదని కంగారు పడిన తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యా యులకు ఫోన్లు ద్వారా విషయం తెలుసుకుని విద్యార్థుల కోసం రెండు ఆటోలు, వేముల బండ వైపు వెళ్లే వారిని వ్యాన్‌లోకి ఎక్కించి వారి తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. పాఠశాల మండల కేంద్రానికి కిలో మీటరుపైగా ఉండటం, ఊరికి చివరిగా ఉండటంతో విద్యార్థులు రెండు గంటలకు పైగా పాఠశాల ఎదురుగా బిక్కుబిక్కు మంటూ నిరీక్షించారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు.

భాస్కర్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బాలాయపల్లి : బాలయ్య పల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డిని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ శనివారం జయంపు గ్రామంలో ఆయన నివాసంలో కలిశారు. భాస్కర్ రెడ్డి సతీమణి ఆరోగ్యంగా ఉందని పేపర్ లో చదివి వచ్చామని తెలిపారు. ఆరోగ్యం ఎలా ఉందని మాట్లాడుతూ రాజకీయ విశ్లేషణలు గుర్తు చేసుకున్నారు.

కల్వర్ట్ మరమ్మతులకు భూమిపూజ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మండలంలోని నేసనూరు గ్రామంలోని కల్వర్ట్ కు ఎఫ్‌డిఆర్ గ్రాంట్ నిధుల ద్వారా అక్షరాల 15 లక్షల రూపాయలతో మరమ్మతులు చేయడానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల యువజన సర్వీసు, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా శనివారం భూమి పూజ చేశారు. నేసనూరులోని కల్వర్టు భారీ వర్షాలతో వరదల కారణంగా దెబ్బతినడంతో మంత్రి ఎఫ్‌డిఆర్ గ్రాంట్ కింద మరమ్మతులు చేయడానికి నిధులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మండలం అధ్యక్షురాలు ముని వేలమ్మ, వైసీపీ మునుస్వామి రెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, నేషనల్ సర్పంచ్ గోవింద స్వామి రెడ్డి, సదాశివ ఆలయ ఛైర్మన్ కొడగంటి రమేష్, ప్రజా ప్రతినిధులు, అధికారులు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కల్వర్టు మరమ్మతుపనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి రోజా

ల్యాబ్, ప్లే గ్రౌండ్ పనుల తనిఖీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: పీఎం శ్రీ స్కీం మొదటి ఫేజ్ కింద ఎంపికైన బిఎస్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ల్యాబ్, ప్లే గ్రౌండ్ పనులను జిల్లా కార్యాలయం సెక్టోరల్ అధికారులు, ప్రత్యామ్నాయ పాఠశాల సమన్వయకర్త శ్రీధర్, అకడమిక్ మానిటరింగ్ అధికారి శివ శంకరయ్య , అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ సారధి, అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి మధు శనివారం తనిఖీ చేశారు. ఎఫ్ఐఆర్‌కేఐ యాప్, దిశా యాప్‌ల గురించి టీచర్లకు వివరించి అందులో టీచర్లు ఎంతమంది రిజిస్ట్రేషన్ చేసు కున్నారు? వారి స్టేటస్ ఏమి టి? తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టరును పరిశీలించి బడికి సక్ర మంగా రాని పిల్లలను ప్రతిరోజూ తప్పక పాఠశా లకు హాజరయ్యేలా చూసు కోవాలని టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 ముని సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పురపాలక పరిధిలోని వట్రపాలెంలో 33 కెవి విద్యుత్ లైన్లు తగిలి వేలూరు భాస్కర్ (49) ఘటన స్థలంలోనే మృతి చెందిన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సూళ్లూరుపేట మండలం ఇలుపూరు గ్రామానికి చెందిన వేలూరు భాస్కర్ ఇసుకను టిప్పర్ ద్వారా తరలించి వట్రపాలెంలో తోలుతుండగా ప్రమాదవశాత్తు 33 కెవి విద్యుత్ వైర్లు తగలడంతో ఘటనా స్థలంలోని వేలూరు భాస్కర్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ కోట రహీం రెడ్డి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముక్కంటి బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారిగా భ్రమరాంబ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 3 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు భ్రమరాంబను ప్రత్యేక అధికారిగా నియమించారు. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనరు సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. భ్రమరాంబ ప్రస్తుతం దేవదాయశాఖ ప్రధాన కార్యాలయంలో సంయుక్త కమిషనరుగా విధులు నిర్వర్తిస్తున్నారు. శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించిన అనుభవం భ్రమరాంబకు ఉంది. ఈ నేపథ్యంలోనే ఆమెను బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారిగా నియమించారు. ఆమె నేతృత్వంలో బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయవచ్చని ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

బ్రహ్మోత్సవ ఏర్పాట్లు వేగవంతం చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవ ఏర్పాట్లను వేగవంతం చేయాలని ముక్కంటి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన శనివారం ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల పనులు పరిశీలించారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈయన వెంట ఈఈ నూకరత్నం, ఏఈవో ధనపాల్ ఉన్నారు.

కలెక్టరును కలిసిన పిసి రాయల్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఛైర్మన్, గిన్నిస్ బుక్ రికార్డు హోల్డర్ పి సి రాయల్ తిరుపతి కలెక్టర్ లక్ష్మీశను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశను కలెక్టరేట్లో కలిసిన పిసి రాయల్ వారికి పుష్పగుచ్ఛం అందించి శుభా కాంక్షలు తెలిపారు. వివిధ కేంద్ర, రాష్ట్ర సంప్రదింపుల కమిటీల అధ్యక్షులు, సభ్యులుగా ఉన్న పిసి రాయల్ తన కార్యకలాపాల గురించి కలెక్టరు వివరించారు. జిల్లా అభివృద్ధి కోసం కృషి చేయాలని కలెక్టర్‌ను కోరారు.

వైసీపీ నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పలువురు వైసీపీ నాయకులు నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ సమక్షంలో శనివారం టిడిపిలో చేరారు. వీరికి పార్టీ కండువా వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్, బిజీ ధనపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఏ ఆనంద్, టిడిపి నాయకులు, యువకులు పాల్గొన్నారు.

' సిద్ధం' సభను జయప్రదం చేయండి: వైసిపి

ప్రజాశక్తి- కెవిబిపురం: సిద్ధం సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య వైసిపి నాయకులను కోరారు. కేవిబి పురం మండలంలోని వైసిపి కార్యాలయంలో వైసిపి కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడు వేదిక గా జరగనున్న 'సిద్ధం' భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ ముని లక్ష్మీ, నందకుమార్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాము , వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : వివిధ రంగాలలోని పరిశోధనల విశ్లేషణలో సాంఖ్యక శాస్త్రం పాత్ర కీలకం అని ఇటలీ విశ్వవిద్యాలయం, సాంఖ్యక శాస్త్ర విభాగానికి చెందిన ఆచార్య మైఖెల్ గాలో పేర్కొన్నారు. ఎస్వీయూ స్టాటిస్టిక్స్ విభాగంలో "మోడ్రన్ స్టాటిస్టిక్స్ ఫర్ రీసెంట్ డెవలప్‌మెంట్స్ ఇన్ డేటా సైన్స్ టెక్నిక్స్' అనే అంశంపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది.